పంచదశాక్షరిని గాని, దశమహా విద్యలను గాని, జపించు సాధకునకు – ప్రాణవశీకారము సిద్ధించును. ప్రాణ శక్తి – వశపడిన యెడల సిద్ధులన్నియు హస్తగతములగునని భావము.

మూ॥ ఏతాః కవీనాం పదకిఙ్కరస్య
పూతాః ప్రమోదం పరమావహన్తు
గీతాస్సభక్తి ద్రవ మిన్ద్రవజ్రాః
శ్వేతాచలాధీశ్వర వల్లభాయాః 25

భక్తి రసముతోఁ గూడి గానము చేయఁబడినవియు, పవిత్రములయినవియు, కవిచరణ భజకుఁడగు గణపతిచే రచింపఁబడినవియు, నగు ఇంద్రవజ్రావృత్త నిబద్ధములగు స్తుతులు – కైలాసపతి ప్రేయసియగు జగదంబకు పరమప్రమోదము నొసఁగుగాత!

ఇది సవ్యాఖ్యమగు ఏకోనచత్వారింశ స్తబకము

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీ సరస్వత్యైనమః

# ఉమాసహస్రము

## (పదియవ శతకమున – చతుర్థ స్తబకము)

## చత్వారింశస్తబకము

**అవ:-** నలువది యగు నీ **యుపసంహార స్తబకమున** – పరదేవతకు – విశ్వములోపలను; వెలుపలను, గలవియు, శ్రీమంతములును, ఊర్జితములును, నగు స్థానముల యందును, విభూతులయందును, స్పష్టమగు సముపాస్యత్వమును దెలుపునవియు వేద, వేదాంత, తాంత్రిక, యోగ, సారభూతములగు తత్త్వములను దెలుపునవియు, నగు రమణీయ గానము గల దైవ గీతములు – గానము చేయఁబడుచున్నవి. ఇవి – పండితులకును, పామరులకు గూడ సులభముగాఁ దెలియునవై యున్నవి. **(కనుక ఈ స్తబకము ముఖ్యమైనది.)**

మూ॥ శమయతుపాపం, దమయతు దుఃఖం,
హరతు విమోహం, స్ఫుటయతు బోధమ్।
ప్రథయతుశక్తిం మన్దం హసితం
మనసిజ శాసనకుల సుదృశోనః॥ 1

మనసిజ శాసనుఁడగు పరమేశ్వరుని కులాంగనయగు పరమేశ్వరి యొక్క దరస్మితము – మాపాపమును తొలఁగించుఁగాత! దుఃఖమును ధ్వంస మొనర్చుఁగాత! వ్యామోహమును (భ్రాంతిని) పోఁగొట్టుఁగాత! జ్ఞానమును వికసింపఁజేయుఁగాత! శక్తినావిష్కరించుఁగాత!

మూ॥ ఆర్ద్రాదయయా పూర్ణాశక్త్యా
దృష్టివశంవద విష్టపరాజా।
అఖిలపురన్ధ్రీపూజ్యా నారీ
మమనిశ్శేషాం విపదం హరతు. 2

దయచేనార్ద్రయు – శక్తి చేత పూర్ణయు, దృష్టి చేత వశీకరింపఁబడిన లోకేశ్వరులు గలదియు, అఖిలపురంధ్రీ జనపూజ్యయు, అగు నారి – (దేవి) నాయాపదను నిశ్శేషముగాఁ దొలఁగించుఁగాత!

**అవ:**- ఇక్కడనుండి 'శుద్ధ బ్రహ్మణి' అని యారంభించి, సృష్టి యందంతటను గూడ – అయా; ఉపాధిభేదములయందు ఉపాసింపఁదగియున్న దైవ స్వరూపమును గానము చేయుచున్నాఁడు.

మూ॥ శుద్ధబ్రహ్మణి మోదోదైవం
తత్రసిసృక్షతి కామోదైవమ్।
సృజతి పదార్థాన్ దృష్టిర్దైవం
తాన్ బిభ్రాణో మహిమాదైవమ్. 3

సకలమనిగాని, నిష్కలమనిగాని, విభజించుటకు విషయము గానిదియు; ద్వంద్వ రహితమైనదియు; స్వతఃసిద్ధమైనదియు నగు వస్తువు – శుద్ధమని చెప్పఁబడును. అట్టి శుద్ధ బ్రహ్మమునందుఁగల, ఆనందము దైవము. (శుద్ధబ్రహ్మమునందగు దైవ స్వరూప మానందమైయున్నది) ఆ బ్రహ్మము – సృజింపఁగోరునపుడు కలుగునదియగు కామము – (ఇచ్ఛ) దైవము. ఆ బ్రహ్మము పదార్థములు (వస్తువులను) సృజంచునపుడు దృష్టి – దైవము. సృజింపఁబడిన వస్తువులనది ధరించునపుడు మహిమ దైవము.

**వివ:**- ఆనందము నుండియే సృష్టి – జనించినది. కావున సృష్టికి ముందు శుద్ధ బ్రహ్మానందరూపమై యుండెను.



''సో కామయత బహుస్యాం ప్రజాయేయ'' ''ఆబ్రహ్మము – బహు రూపములుగా నయ్యెదను'' అని కోరెను.

అని శ్రుతి ప్రతిపాదితమగు సర్జనేచ్ఛకలిగినపుడు దైవ స్వరూపము – కామమగుచున్నది. ''ఈక్షించుట' మొదలుకొని 'ప్రవేశించుట' వఱకును గల సృష్టి- 'తదైక్షత'' తదనుప్రవిశ్య' ఇత్యాదిశ్రుతుల చేత ప్రసిద్ధమైయున్నది. ఈ లక్షణము వలన సృష్టి నిర్వహింపఁబడుట వలన, సృష్టి – ప్రచలితమగునపుడు దృష్టియే – దైవ స్వరూపమని చెప్పఁబడినది. సృజింపఁబడిన పదార్థములను ధరించునపుడంతటను వ్యాపించి వానిని ధరించుట వలన – మహత్త్వము – దైవ స్వరూపమని చెప్పఁబడినది.

ఇట్లు :– సృష్టికి ముందున్న నిర్గుణ బ్రహ్మము నందు ఆనందమును, తదుపరి కామమును, తరువాత దృష్టియు, పిమ్మట మహిమయు – దైవస్వరూపమని యుపాసింపవలయునని భావము.

మూ॥ వికృతౌ వికృతౌ ప్రకృతిర్దైవం
విషయే విషయే సత్తాదైవమ్।
దృష్టౌ దృష్టౌ ప్రమితిర్దైవం
ధ్యానే ధ్యానే నిష్ఠా దైవమ్॥ 4

ప్రతి వికృతియందును, వికృతి నొందని ప్రకృతి – దైవమగుచున్నది. ప్రతి విషయమునందును – దాని యునికికి హేతువగుసత్త – దైవమగుచున్నది. ప్రతి దృష్టి యందును ప్రమితి – (ప్రమ లేక బుద్ధియే) దైవమగుచున్నది. ప్రతి ధ్యానమునందును – నిష్ఠ – (దృఢమగు స్థితియే) దైవమగుచున్నది.

**ప్రభ:**- నామరూపముల చేత వస్తువులు వికృతి నొందుచుండునపుడు, వికృతి నొందని ప్రకృతి దైవమనియు, ఉనికి గలిగి భాసించుచున్న విషయము లన్నింటియందును గల సత్త – దైవమనియు, దర్శనకర్మము నందలి బుద్ధి – దైవమనియు, ధ్యానమునందలి నిష్ఠ – దైవమనియు నుపాసింపవలయునని భావము.

మూ॥ స్ఫూర్తౌ స్ఫూర్తౌ మాయా దైవం
చలనే చలనేశక్తిర్దైవం
తేజసి తేజసి చక్షుర్దైవం
శబ్దే శబ్దే వాణీదైవమ్॥ 5

ప్రతి స్ఫురణమునందును (ప్రతిస్పందనము, లేక కంపనము నందును,) దానికి హేతువగుమాయ – (మహాశక్తి) దైవమగుచున్నది. ప్రతి చలనమునందును, తదావశ్యకమగు శక్తి – దైవమగుచున్నది. ప్రతి తేజమునందును, చక్షువు, లేక లక్ష్మి – (కాంతియే) దైవమగుచున్నది. ప్రతి శబ్దమునందును, వాణి – దైవమగుచున్నది.

మూ॥ హృదయే హృదయే జీవద్ దైవం
శీర్షే శీర్షే ధ్యాయద్ దైవమ్।
చక్షుషి చక్షుషి రాజద్ దైవం
మూలే మూలే ప్రతపద్దైవమ్॥ 6

ప్రతి హృదయమునందును ప్రాణించునది – (జాగరూకమగునది) దైవము. ప్రతి శీర్షమునందును ధ్యానించునది దైవము. ప్రతి చక్షువునందును రాజిల్లునది – దైవము. ప్రతిమూలాధారచక్రము నందును ప్రజ్వలించునది – దైవము.

మూ॥ అభితోగగనే ప్రసరద్ దైవం
పృథివీలోకే రోహద్దైవమ్।
దినకరబిమ్బే దీప్యద్దైవం
సితకరబిమ్బే సిఞ్చద్దైవమ్॥ 7

ఆకాశమునందంతటను ప్రసరించునది – (వ్యాపించునది) దైవము. భూలోకము నందు, మొలుచునది – (వృక్షాదిరూపమున జనించునది) దైవము. సూర్యమండలమున వెలుఁగునది – దైవము. చంద్రమండలమున, (అమృతమును) స్రవించునది – దైవము.



మూ॥ శ్రావం శ్రావం వేద్యం దైవం
నామం నామం రాధ్యద్ దైవమ్।
స్మారం స్మారం ధార్యం దైవం
వారం వారం స్తుత్యం దైవమ్॥ 8

వినికిని, శ్రవణము చేత – (ఆ వృత్తి బలమువలన) తెలియఁదగినది – దైవము. నమస్కరించి నమస్కరించి, సాధింపఁదగినది. దైవము. స్మరించి స్మరించి, (స్మరణావృత్తి బలము వలన) ధరింపఁదగినది దైవము. వరించి (మిక్కిలిగా కోరుట వలన స్తుతింపఁదగినది – దైవము.

మూ॥ శ్రుతిషు వటూనాం గ్రాహ్యం దైవం
గృహిణామగ్నౌ తర్ప్యం దైవమ్।
తపతాం శీర్షే పుష్టం దైవం
యతినాం హృదయేశిష్టం దైవమ్॥ 9

వేదాధ్యయన యొనర్చు బ్రహ్మచారులకుఁ దెలియఁదగినది – దైవము. గృహమేధులకు అగ్ని హోత్రము చేత తృప్తినొందింపఁదగినది – దైవము, తపోనిష్ఠుల శీర్షమునందు వృద్ధినొందునది – దైవము. యతులకు హృదయమునందు, స్వరూపము చేత మిగిలినది – దైవము.

**ప్రభ:**-బ్రహ్మచారులకు స్వాధ్యాయమే ఆశ్రమ ధర్మమగు తపస్సు. కావున వారికి స్వాధ్యాయమునందున్నది. – దైవమగుచున్నది. యతుల మనస్సు – వృత్తి శూన్యమగుట వలన స్వరూపముతో నవశేషించిన యాత్మయే – వారికి దైవమగును.

మూ॥ నమతాపుష్పైః పూజ్యం దైవం
కవినా పద్యారాధ్యం దైవమ్।
మునినా మనసాధ్యేయం దైవం
యతినా స్వాత్మనిశోధ్యం దైవమ్॥ 10

నమస్కరించువాని చేత – పూవులచేఁ బూజింపఁదగినది – దైవము. కావ్య నిర్మాతయగు కవిచేతపద్యముల చేత నారాధింపఁదగినది – దైవము మనన శీలుఁడగు ముని చేత – మనస్సు చేత ధ్యానింపఁదగినది – దైవము. యమవంతుఁడగు యతిచేత– (నైష్ఠికుని చేత) స్వాత్మయందు శోధింపఁదగినది – దైవము.

విവ:-' చిత్త కాలుష్యమునుడిగి – శుద్ధమును, స్వమూల స్వరూప భూతమును, దైవము నుపాసించుటకు యతియేతగు యుక్తుఁడు గదా!

మూ॥ స్తువతాం వాచోవిదధద్ దైవం
స్మరతాం చేతః స్ఫుటయద్ దైవమ్।
జపతాంశక్తిం ప్రథయద్ దైవం
నమతాం దురితం దమయద్ దైవమ్ ॥ 11

స్తోత్రమొనర్చు వారికి – వారి వాక్కులను స్తుతి సమర్థములుగా నొనర్చునది దైవము. స్మరించువారికి ( ధ్యాతలకు) చిత్తమును వికసింపఁజేయునది – దైవము– (మంత్రమును) జపించువారికి – శక్తిని విజృంభింపఁజేయునది – దైవము. నతిఁగావించువారికి పాపమును నశింపఁజేయునది – దైవము.

మూ॥ వాచోవినయద్ వహ్నౌదైవం
ప్రాణాన్ వినయద్విద్యుతి దైవమ్।
కామాన్ వినయచ్చన్ద్రేదైవమ్
బుద్ధీర్వినయత్ సూర్యే దైవమ్॥ 12

అగ్నియందుండి వాక్కులను శిక్షించునది – ( ఉపదేశించునది) దైవము. మెరుపునందుండి ప్రాణములను శిక్షించునది – (నడిపించునది) దైవము చంద్రునియందుండి కోరికలను శిక్షించునది – (పెంపొందించునది) దైవము. సూర్యునియందుండి బుద్ధులనుపదేశించునది – (ప్రేరణచేయునది) దైవము.



ప్రభ:-''అగ్ని ర్వైవాగ్ భూత్వాముఖం ప్రావిశత్'' ''అగ్నియే వాక్కై ముఖమునందు ప్రవేశించెను.'' అను మంత్రము చేత – అగ్ని – వాగ్ దేవతగా చెప్పఁబడినది. కావున – అగ్నియందుండి వాక్కుల నుపదేశించునది – దైవమని చెప్పఁబడినది. అంతరిక్షమునందు వ్యాపించిన జ్యోతిస్సునందున్నవై, ప్రాణములను చలింపఁజేయునది దైవస్వరూపమైయున్నది. ఇక్కడ నుండి, సకాముఁడగు మనుష్యుఁడు మరణించి చంద్రలోకనమునకు వెళ్ళును.

''క్షితేః సుధాకరంగతాన్ పిత్యాన్వినేతుమవ్యయే''

అని ఇందలి ప్రథమ శతకమునందలి ద్వితీయ స్తబకమున నీయంశము చెప్పఁబడినది. కావుననే చంద్రుని యందున్నదై కామములను గరపునది దైవమని చెప్పఁబడినది. సూర్యుఁడు – బుద్ధులను ప్రేరణచేయునను నంశము – వేదమున ప్రసిద్ధమగు చున్నది. ''ధియోయోనః ప్రచోదయాత్'' '' ఏ సూర్యుఁడు– మా బుద్ధులను ప్రేరణ చేయునో'' అని గాయత్రీమంత్రము చెప్పుచున్నది గదా! కావుననే, సూర్యునందున్నదై, బుద్ధులను ప్రేరేపించునది దైవస్వరూపమని యిందుఁజెప్పఁబడినది.

మూ॥ హృదయే నివసద్ గృహ్ణాద్ దైవం
వస్తౌనివసద్ విసృజద్ దైవమ్।
కణ్ఠేనివసద్ ప్రవదద్ దైవం
కుక్షౌనివసత్ ప్రపచద్ దైవమ్॥ 13

హృదయమున నివసించుచు (సర్వమును) గ్రహించునది (తెలిసికొనునది) దైవము. (వస్తియందు నాభికిఁ గ్రింది ప్రదేశమున) నివసించుచు ( అశుచి పదార్థములను) విడుచునది – దైవము. కంఠమున నివసించుచు ప్రవచనము నొనర్చునది – (మాటాడునది) దైవము. ఉదరమునందు నివసించుచు (భుజింపఁబడినయన్నమును) పక్వమొనర్చునది – దైవము.

ప్రభ:-సాక్షిగా నుండి దైవమే - సర్వమును గ్రహించును. కావున హృదయమున నివసించుచు, గ్రహించునది దైవమని చెప్పఁబడినది.

మూ॥ దేహే నివసద్ విచలద్ దైవం
పఞ్చ ప్రాణాకారం దైవమ్।
భాగిసమస్త స్యాన్నేదైవం
స్వాహాకారేతృప్యద్ దైవమ్॥ 14

దేహమునందు స్థిరముగా నివసించుచు, విశేషముగా చలించునది – దైవము, పంచప్రాణాకారమును బోలిన యాకారము గలది - దైవము. భోక్తలందఱికిని భోజ్యమగు నన్నమునందు భాగము గలది –దైవము. స్వాహాకారమునందు తృప్తి నొందునది దైవము.

వివ:– దైవము నివసింపని యెడల దేహమునకు చలనము కలుగదు. కావున దేహమునందుండి చలించునది - దైవముగాఁ జెప్పఁబడినది. ప్రాణాపాన సమానవ్యానోదానముల రూపము వంటి రూపముగలదగుట వలన దైవము - పంచప్రాణాకారమని చెప్పఁబడినది. అన్నభోక్తయొక్క మూల స్వరూపమున నుండి, వానిని భుజింపఁజేయునది కావున దైవము – భుజ్యమానమగు నన్నమున భాగము గలదగుచున్నది.

'స్వాహా' అనునది - దేవతలకు తృప్తినిచ్చు వాచకమగుచున్నది. కావున దైవము - స్వాహాకారమున తృప్తినొందునదని చెప్పఁబడినది.

**అవ:**- దైమును స్త్రీరూపముగా భావించి ప్రత్యంగస్తవము నొనర్చుచున్నాఁడు.

మూ॥ బిభ్రన్నారీ వేషం దైవం
శుభ్ర దరస్మిత విభ్రాడ్ దైవమ్।
అభ్రమదాపహ చికురం దైవం
విభ్రమవాసస్థానం దైవమ్॥ 15



నారీరూపమును ధరించునది - దైవము
తెల్లని చిరునవ్వుచేత వెలయునది దైవము
నీలమేఘదర్పమునడఁచు కేశపాశము గలది దైవము
విలాసములకు నివాస స్థలము దైవము.

మూ॥ శీతజ్యోతిర్వదనం దైవం
రుచి బిన్దూపమరదనం దైవమ్
లావణ్యామృత సదనం దైవం
స్మరరిపులోచన మదనం దైవమ్॥ 16

శీతజ్యోతిని బోలిన ముఖము గలది – దైవము. కాంతి బిందువుల తోడి సాదృశ్యము గలదంతములు గలది - దైవము. లావణ్యమను నమృతమునకు నివాసభవనము - దైవము. స్మరునకు శత్రువగు హరుని నేత్రములకు హర్షమునిచ్చునది – దైవము.

మూ॥ లక్ష్మీ వీచిమదలికం దైవం
ప్రజ్ఞావీచిమదీక్షం - దైవమ్
తేజో వీచిమదధరం - దైవం
సమ్మదవీచిమదాస్యం - దైవమ్ 17

లక్ష్మీ తరంగములు గల లలాటము గలది – దైవము
ప్రజ్ఞాతరంగములు గల దృష్టి గలది- దైవము
తేజస్తరంగములు గల కెమ్మోవి గలది దైవము
ఆనంద తరంగములు గల యాననము గలది - దైవము

మూ॥ కరుణోల్లోలిత నేత్రం - దైవం
శ్రీకారాభశ్రోత్రం - దైవం
కుసుమ సుకోమలగాత్రం - దైవం
కవివాగ్ వైభవ పాత్రం - దైవమ్॥ 18

కృపా తరంగితములగు నేత్రములు గలది – దైవము.
శ్రీకారమువంటి ఆకారము గల శ్రోత్రము గలది – దైవము
పుష్పమువలె మిక్కిలి కోమలమగు గాత్రము గలది – దైవము
కవియొక్క వాగ్వైభవమునకు పాత్రమగునది – దైవము.

ప్రభ:– నాగరలిపియందుఁగాని; ఆంధ్రలిపియందుఁగాని, లిఖింపబడిన 'శ్రీ' '(శ్రీ)' అను నక్షరము యొక్క ఆకారము వంటి ఆకారము గల శ్రోత్రములు గలది దైవమని భావము.

మూ॥ హిమవతి శైలే వ్యక్తం దైవమ్
సితగిరి శిఖరే క్రీడద్ దైవమ్।
తుమ్బురునారదగీతం దైవం
సురమునిసిద్ధధ్యాతం దైవమ్॥ 19

హిమాలయ పర్వతమున వ్యక్తమయినది – దైవము
కైలాసగిరి శిఖరమున క్రీడించునది – దైవము
తుంబురునారదుల చేత గానము చేయఁబడినది – దైవము
సుర–ముని–సిద్ధుల చేత ధ్యానము చేయఁబడునది – దైవము.

ప్రభ:- హిమాలయమునందుమా రూపమున ప్రకాశించునదియు, కైలాసశృంగమున విహరించునదియు, గాయకభక్తుఁడగు తుంబురుని చేతను, భక్తాగ్రేసరుఁడగు నారదుని చేతను, సంకీర్తింపబడునదియు, దేవతల చేతను, ఋషుల చేతను, సిద్ధుల చేతను, ఏకాగ్రత చేత ధ్యానింపఁబడునదియు నగు దివ్య (శ్రీ) స్వరూపము – దైవమని భావము.

మూ॥ క్వచిదపి రతిశత లలితం దైవం
క్వచిదపి సుతరాం చణ్డం దైవమ్
భక్త మనోనుగ వేషం దైవం
యోగి (యుక్త) మనోనుగ విభవం దైవమ్॥ 20



కొన్ని చోటులందు క్రీడాశతములచే లలితము – దైవము
" మిక్కిలియు చండము – దైవము
భక్తజనమనోనుసారియగు వేషము గలది – దైవము
యుక్త (యోగి) మనోనుసారయగు నైశ్వర్యము గలది – దైవము.

ప్రభ:- లలితవుఁగా సౌమ్యమనియు, చండవుఁగా ఉగ్రమనియునర్థమును గ్రహించునది. భక్తుల సంకల్పమునను సరించు బాహ్య రూపముగలది దైవము కావుననే–

''యోయోయాం యాంతనుంభక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి।
తస్యతస్యాచలాం శ్రద్ధాంతామేవ విదధామ్యహమ్''

'' ఏయే మనుష్యుఁడు – ఏయే శరీరమును – భక్తుఁడై శ్రద్ధతో పూజింపఁగోరునో, ఆయా మనుష్యున కాయచలమగు శ్రద్ధను – నేనే కలిగింతును'' అని గీతచెప్పుచున్నది.

యోగిజన సంకల్పము – వ్యర్థము కాదు. కావున వారి సంకల్పము ననుసరించు వైభవము గలది – దైవమే యగును.

మూ॥ చరితే మధురం స్తువతాం దైవం
చరణే మధురం నమతాం దైవమ్।
అధరే మధురం శంభో ర్దైవం
మమతుస్తన్యే మధురం దైవమ్॥ 21

స్తోతలకు చరిత్రమునందు మధురము – దైవము
నమస్కరించువారికి – చరణమునందు మధురము – దైవము
శివునకు – అధరము నందు మధురము – దైవము
పుత్రుఁడనగు (నాకు) స్తన్యమునందు మధురము – దైవము.

**ప్రభ:-** దైవ స్వరూపమగు భగవతి – స్తుతి కారులయందు కారుణ్యమును ప్రదర్శించును. కావున, వారికి మధురమైన నడవడి గలదగుచుండును. నమస్కరించు వారికి దేవీచరణమాధుర్యము తెలియును. కావున వారికి చరణమునందలి మాధుర్యము గలది – దైవమని చెప్పఁబడినది. శివునకు రమణీయ మగుట వలన కెమ్మోవి యందలి మాధుర్యము గలది – దైవమగుచున్నది. మాత యొక్క స్తన్యరసమును శిశు వేయెఱుంగును. కావున గణపతికి స్తన్యమునందలి మాధుర్యము గలది – దైవమగుచున్నది.

విశే:– ఇట్లు, అంతటను, మధురమగు (మాధుర్యము గలదియు) దైవము– దేవియేయని యెఱుంగునది.

మూ॥ భుజభృత విష్టపభారం దైవం
పదధృతసమ్పత్సారం దైవమ్।
లాలిత నిర్జర వీరం దైవమ్
రక్షిత సాత్త్విక ధీరం దైవమ్॥ 22

నిజబాహువుల చేత లోక భారమును వహించునది – దైవము
పదముల చేత సంపత్సారమును ధరించునది– దైవము.
నిర్జర వీరులను లాలించునది – దైవము
సత్త్వగుణయుక్తులగు ధీరులకు రక్షించునది – దైవము.

మూ॥ చిచ్ఛక్త్యాత్మకమధితను దైవం
తటిదాకృత్యధిభూతం దైవమ్
శ్రుతిషు శివేతి ప్రథితం దైవం
జయతి జగత్త్రయ వినుతం దైవమ్॥ 23

శరీరమునందున్న చితి శక్తి స్వరూపము – దైవము. బాహ్య వస్తువునందున్న విద్యుదాకారము – దైవము. శ్రుతులయందున్న 'శివ' అనునామమునఁ బ్రసిద్ధము – దైవము. దైవమిట్లు త్రిలోకసంస్తుతమై వెలయుచున్నది.



**ప్రభ:-** ఆధ్యాత్మమగు దైవము – చితి శక్తి, అధిభూతమగు దైవము – విద్యుత్తు, అధి వేదమగు దైవము – శివ, ఇట్లు, ఉమా దైవము – ప్రసిద్ధమగుచున్నదని భావము.

మూ॥ రమణ మహర్షే రన్తేవాసీ
మధ్యమపుత్రో నరసింహస్య।
వాసిష్ఠోఽయం మరుతాం మాతు
ర్గణపతి రఙ్ఘ్రిం శరణముపైతి॥ 24

అరుణాచల వాసియగు రమణమహర్షికి – అంతే వాసియు, (అతని చేత ననుగ్రహింపఁబడుట వలన శిష్యుఁడును) నరసింహునికి మధ్యమ పుత్రుఁడును, వసిష్ఠ గోత్రమున జనించిన వాఁడును, అగు ఈ గణపతి – మరుత్తులకు తల్లియగు నింద్రాణి యొక్క చరణమును శరణముగా నాశ్రయించుచున్నాఁడు.

**ప్రభ:-** నరసింహశాస్త్రికి పుత్రులు ముగ్గురనియు, అందితఁడు – మధ్యముఁడనియు, దీనివలన స్పష్టమగుచున్నది.

మూ॥ త్రిభువనభర్తుః పరమాశక్తిః
సకల సవిత్రీ గౌరీ జయతి।
తన్నుతి రేఖా గణపతి రచితా
పాదాకులక ప్రాన్తా జయతి॥ 25

త్రిలోకేశ్వరుని సర్వోత్కృష్టశక్తియు, సకల సవిత్రియు, (విశ్వజననియు) అగు ఉమాదేవి – సర్వోత్కృష్టయై వెలయుచుండును. గణపతి విరచితమును – శ్రేష్ఠములగు పాదాకులకవృత్త నిబద్ధ పద్యములతో ముగింపబడినదియు నగు – ఈ ''యుమాసహస్రస్తుతి'' – ఉత్కర్షతో వెలయుచుండును. ఇట్లు – వాసిష్ఠ గణపతి ముని ప్రణీతమగు నీ యుమాసహస్రము – విజయము నొందుగాత! విజయము నొందుగాత!!

ఇతి శ్రీ మహర్షి – రమణ భగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతావుమాసహస్రే,

చత్వారింశః స్తబకః సమాప్తః.
సమాప్తంచ దశమం శతకమ్॥
॥ ఉమాసహస్రం సమాప్తమ్॥

ఇది శ్రీ మహర్షి రమణ భగవత్పాద శిష్యుఁడు, శఠమర్షణ సగోత్రుఁడు,
శ్రీ మత్స్యంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు; వేంకటరామబుధేంద్ర
(ద్వితీయ) పుత్త్రుడు లక్ష్మీనారాయణ శాస్త్రిచే నాంధ్రీక
రింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్ర కావ్యమునందు
చత్వారింశ స్తబకము సమాప్తము.
దశమ శతకము ముగిసినది.
ఓమ్. తత్. సత్.

## ఫలస్తుతి

(గ్రంథ పఠన ఫలమును గురించి నాయన యిట్లు గానము చేసెను.)

శ్లో॥ యది గాయ న్నిమం గ్రంథ ముత్తరే దాపదః కృతీ ।
మహిమాస మహేశ్వర్యాః శీఘ్రం స్యాదున్నతంనమే ॥
అయ మంబా పదప్రీతే రుద్గారో వాఙ్మయాకృతిః ।
అర్థః కశ్చిదనేనా పి సతాం యది మయా జితం ॥

(అర్థము – పుణ్యాత్ముఁడైనవా డీ గ్రంథమును పఠించినచో నాపదలను దాటగలడు. ఆ విషయము పరమేశ్వరి యొక్క మహిమయే కాని నా గొప్పతనము కాదు. ఈ వాఙ్మయాకృతి యంబయొక్క పాదములందు నాకుగల ప్రీతి సంబంధమగు నుద్గారము. కనుక సత్పురుషులకేమైన దీని వలన నుపకారమైనచో నా కది విజయమే.)

* * * *